క్లుప్తంగా

దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

పాలకుర్తి టౌన్‌: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం జరిగే రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కడపల్ల సోమేశ్వర్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉత్సవ వేడుకల్లో భాగంగా సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకారం,డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. రాష్ట్ర మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్ పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరుప్పుల : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సుధాకర్ తెలిపారు. వడ్డె కొత్తపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున దేవరుప్పుల, మున్‌పహాడ్, గొల్లపల్లి, కామారెడ్డిగూడెం వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

'బల్మూరి'ని కలిసిన నాయకులు



బచ్చన్నపేట : ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా నామినేషన్ వేసిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌ను ఆ సంఘం మండల అధ్యక్షుడు అందె సంజయ్‌గౌడ్ కలిసి శాలువాతో సన్మానం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్ నుంచి అసెంబ్లీ వరకు నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో పాల్గొని ఎమ్మెల్సీ వెంకట్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ మండల నాయకులు, తదితరులు ఉన్నారు.

నేడు నవోదయ ప్రవేశపరీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్: నవోదయ విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షల్లో భాగంగా మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ సెంటర్‌లో 197 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందని, విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి గంటముందు నుంచే అనుమతిస్తారన్నారు.

రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన

బచ్చన్నపేట : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సమర్థవంతమైన పాలన అందుతుందని యూత్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ చల్లా ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పేదల బాధలు తెలుసునని వారి సంక్షేమార్థం పాటు పడుతారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తారని అన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు అనవసరమైన విమర్శలు చేస్తున్నారని అధికారంలో ఉన్నప్పుడు ఏమి చేశారని వారు విమర్శించారు.

ప్రశాంతంగా విగ్రహం ఏర్పాటు చేసుకోవాలి

తరిగొప్పుల: ప్రశాంత వాతావరణంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై దూదిమెట్ల నరేష్ సూచించారు. మండలకేంద్రంలో పాపన్న విగ్రహం ఏర్పాటు విషయంలో నెలకొన్న సమస్యపై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరువర్గాలతో సమావేశం నిర్వహించి తగు సూచనలు చేశారు. ఇరువర్గాల వారు చర్చించుకొని ఎలాంటి గొడవలకు తావులేకుండా విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవాలని తెలిపారు.

అందరి సహకారంతో సౌకర్యాలు కల్పిస్తాం



చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి–కొండాపూర్ గ్రామ పంచాయతీల సరిహద్దులో ఉన్న సమ్మక్క–సారలమ్మ (మినీమేడారం) జాతర ప్రాంగణంలో అభివృద్ధి పనులను చైర్మన్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరి సహకారంతో భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. సమావేశంలో కమిటీ బాధ్యులు మోతె మహేష్, గుగులోతు దేవేందర్, పోతరాజు, రమేష్, అనీల్, కనుకయ్య, రాజు, సంపత్, కర్ణాకర్‌రెడ్డి, అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సంప్రోక్షణ, పూజలు



ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

జనగామ: ఈనెల 22న అయోధ్య శ్రీరామ మందిర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జనగామ జిల్లా ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం వేడుకలను ప్రారంభించారు. మహిళలు వైదికంగా పూజించిన శుద్ధజలంతో దేవాలయ ప్రాంగణాన్ని సంప్రోక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా ప్రముఖ్ దొంతుల శేఖర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో 22న (సోమవారం) వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఇంటింటికీ సాయంకాలం దీపారాధనలు చేసి భక్తిని చాటుకోవాలన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంగా మూలబావి శ్రీ హనుమత్ రామనాథ సహిత శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఎల్‌ఈడీ స్క్రీనింగ్ ద్వారా అయోధ్య రాముడి ప్రతిష్ఠాపన కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలను తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రస్ట్ జిల్లా అక్షింతల ప్రముఖ్, దేవాలయ ప్రధానార్చకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సంప్రోక్షణ కార్యక్రమంలో లక్ష్మీనర్సయ్య, రామకృష్ణ, బాలనారాయణ, కృష్ణమూర్తి, రాంబాబు, నాగరాజురెడ్డి, రవిరెడ్డి, రాజేశ్వర్ భార్గవ, యాదగిరిరెడ్డి, స్వరూప, శ్యామల, అలివేలు, వరలక్ష్మి, నాగమణి, కవిత, అనిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పోరు ఉధృతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వీ రమ

జనగామ రూరల్: బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరు ఉధృతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో కార్మిక కర్షక ఐక్యత దినోత్సవం జిల్లా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో నానాటికి మతోన్మాద దాడి పెరుగుతుందని రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని 10 ఏళ్లలో తీవ్రంగా నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నా యకులు రాపర్తి రాజు, బొట్ల శ్రీనివాస్, చందు, సింగారపు రమేష్, ఉపేందర్, ప్రకాష్, మీట్యానాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



జనగామ రూరల్: డీఈఓ కార్యాలయంలో డీటీఎఫ్ 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం డీఈఓ రాము ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యాపక జ్వాల సంపాదకవర్గ సభ్యురాలు జి.కళావతి, జిల్లా అధ్యక్షుడు ఇప్పట రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. దివాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చొక్కయ్య, శ్రీనివాసాచారి, నాగేందర్, అప్సర్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గ్రీన్‌వుడ్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల విద్యార్థులు

జనగామ రూరల్ : మండలంలోని వడ్లకొండ గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన నామాల రాంప్రసాద్, కబడ్డీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ సల్లావుద్దీన్ తెలిపారు. శుక్రవారం విద్యార్థిని పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో జనగామలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన రాంప్రసాద్ వరంగల్ తరపున ఆడాడు. ఈనెల 24న జార్ఖండ్‌లో జరగనున్న జాతీయ స్థాయిపోటీలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా పీఈటీ సురేందర్ అభినందించారు.

కబడ్డీలో అఖిలకు సిల్వర్ మెడల్



పాలకుర్తి : జనగామ జిల్లా కేంద్రంలో ధర్మకంచ పాఠశాలలో 16, 17, 18 తేదీల్లో జరిగిన 67వ అంతర్ పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పోటీల్లో మొలుగూరి అఖిల సిల్వర్ మెడల్ సాధించింది. శుక్రవారం పాలకుర్తి మండలం చెన్నూరు పాఠశాలలో అఖిలను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అఖి ల రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతుందని వ్యా యామ ఉపాధ్యాయుడు కూటికంటి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుస్కూరి పార్వతి రాజేశ్వర్, ఎంపీటీసీ కళింగరావు, నోడల్ ఆఫీసర్ నర్సయ్య, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్యాంసుందర్‌రావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలి

బచ్చన్నపేట : ప్రతి విద్యార్థి మన తెలుగు భాషపై మక్కువ పెంచుకోవాలని మండలంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ వేమన పద్యాలతో మన నైతిక విలువలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయని అన్నారు. వేమన జయంతి సందర్భంగా వేమన ఫౌండేషన్ అనంతపురం ఆధ్వర్యంలో జనగామ జిల్లా కేంద్రంలో వేమన పద్యపఠన పోటీలను నిర్వహించగా ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందారని అన్నారు.

'ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎదిగాను..'



లింగాలఘణపురం: ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఎదిగానని రిటైర్డ్ ప్రిన్సిపాల్ కళ్లెం గ్రామానికి చెందిన ఎడ్ల నర్సయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు తన భార్య మంగతయారు జ్ఞాపకార్థం ఆల్ ఇన్‌వన్ గైడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈ పాఠశాల పూర్వ విద్యార్థినని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నానని చెప్పారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేయాలని హెచ్‌ఎం మల్లికార్జున్‌కు రూ.5వేలు అందజేశారు. అంతేకాకుండా తనకు పాఠశాలలో ఓనమాలు నేర్పిన రిటైర్డ్ హెడ్మాస్టర్లు చంద్రారెడ్డి, ఆనందంను సన్మానించారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్‌లు

జఫర్‌గఢ్: సర్పంచ్‌లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించడంతో పాటు పదవి కాలాన్ని పొడిగించాలని కోరుతూ మండలానికి చెందిన ఆయా గ్రామాల సర్పంచ్‌లు జనగామ జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు రాక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇప్పటి వరకు రాలేదన్నారు. కరోనా మూలంగా రెండేళ్ల పాటు తమ పదవీ కాలం వృథా కావడం జరిగిందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం తమ పదవీ కాలాన్ని పొడిగించడంతో పాటు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు గాదె ప్రవీణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, భూక్య పార్వతి, బానోతు తులసి, పొన్నాల జ్యోతితో పాటు తదితరులు ఉన్నారు. కాగా జిల్లా జిల్లా పంచాయతీ అధికారి రంగాచారికి కూడా వినతిపత్రాన్ని అందజేశారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడకండ్ల : మండలంలోని మొండ్రాయికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, వార్డు సభ్యుడు కొమ్ము నర్సింహా తండ్రి రాజాలు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మచ్చ మల్లేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పాలకుర్తి: మండలంలోని శాతపురం గ్రామ సమీపంలోని తండాకు చెందిన గుగులోతు దూలమ్మ మృతి చెందింది. శుక్రవారం చుక్కా రామయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు మాచర్ల పుల్లయ్య మృతురాలి కుమారుడు దేవోజీకి రూ.3 వేలు విలువైన బియ్యంను అందజేశారు. అందజేసిన వారిలో ఫౌండేషన్ సభ్యులు సభ్యులు అనుముల మహేందర్, లింగంపల్లి నర్సయ్య, బెల్లి దేవేందర్, కొండపర్తి విష్ణు, లోనె శ్రీను పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడుతాం

బచ్చన్నపేట : మండలంలోని చిన్నరామన్‌చర్ల గ్రామ అభివృద్ధికి పాటు పడుతామని ఉపసర్పంచ్ సిద్దారెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామంలో ని ర్మిస్తున్న అండర్ డ్రైయినేజీ మురుగుకాల్వల నిర్మాణానికి ఆయన భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ. 2 లక్షలతో 100 మీటర్ల అండర్ డ్రైయినేజీ నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. అలాగే గ్రామంలో అవసరం ఉన్న మేర సీసీ రోడ్ల నిర్మాణం చేశామని, నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా నిర్మించామని త్వరలోనే ఆ భవనం ప్రారంభం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి, పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

తరిగొప్పుల: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సర్పంచ్ ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్ అన్నారు. మండలంలోని అంకుషాపూర్‌కు చెందిన ఆయుదాల స్వామి జ్ఞాపకార్థం అతని స్నేహితులు శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించగా విజేతలకు బహుమతులు అందజేశారు. మాన్‌సింగ్ తండా జట్టుకు రూ.10 వేల నగదును పోగుల అశోక్ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన అంకుషాపూర్ జట్టుకు సర్పంచ్ బుచ్చిరాజ్ యాదవ్ రూ.1500 నగదును అందజేశారు.

సమ్మక్క ఎత్తు బంగారం సందడి



స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో స్టేషన్‌ఘన్‌పూర్‌లో బెల్లం విక్రయించే కిరాణా షాపుల వద్ద సందడి నెలకొంటుంది. ప్రధానంగా అమ్మవార్లకు ఎత్తు బంగారం (బెల్లం)సమర్పిస్తామని మొక్కుకున్న భక్తులు ముందస్తుగా ఎత్తు బంగారం(బెల్లం) విక్రయాలు చేస్తున్నారు. భక్తులు కాంటాల వద్ద కొబ్బరికాయలు కొట్టి అమ్మవార్లకు మొక్కుకున్న విధంగా ఎత్తు బంగారాన్ని తూకం వేసి కొనుగోళ్లు చేపడుతుండగా ఆయా షాపుల వద్ద సందడి నెలకొంటుంది.

ప్రజలకు ధైర్యం కల్పించేందుకే కవాతు



పాలకుర్తిలో కవాతు నిర్వహిస్తున్న రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు, స్థానిక పోలీసులు

పాలకుర్తి టౌన్: ప్రజలకు ధైర్యం కల్పించేందుకు కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహిస్తున్నామని స్థానిక సీఐ డి.విశ్వేశ్వర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలోని గుడివాడ చౌరస్తా నుంచి రాజీవ్ చౌరస్తా వరకు రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలని రాపిడ్‌యాక్షన్ ఫోర్స్ బలగాలతో కవాతు నిర్వహించి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీసీ బాగెల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్‌ను సీఐ ఘనంగా సన్మానించారు. ఎస్సైలు తాళ్ల శ్రీకాంత్, బండి శ్రావణ్‌కుమార్, లింగారెడ్డి పాల్గొన్నారు.

నేటినుంచి దుర్గామాత ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన దుర్గామాత ఆలయం

బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలో శనివారం నుంచి దుర్గామాత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని మొదటి రోజు దుర్గామాతకు రాత్రివేళ ఊరంతా కలిసి బోనాలను చేసి ఆలయం ముందు పెడతారు. అలాగే దుర్గామాత కల్యాణం జరుగుతుందని తెలిపారు. ఆదివారం ఊరంతా కలిసి వనభోజనాలకు వెళ్లడం ఉంటుందన్నారు. పలు కూడళ్లలో దేవతల ప్రతిమల ఆర్చిలను కూడా అమర్చామన్నారు. గ్రామంలో ఎలాంటి అల్లర్లు జరుగకుండా ఎస్సై కంకల సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీల సమాచారం పొందుపర్చాలి

- డీఆర్‌డీఓ మొగులప్ప



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ మొగులప్ప

దేవరుప్పుల : స్వయం సహాయక మహిళా సంఘాల సమగ్ర సమాచారాన్ని లోకోస్ యాప్‌లో నిర్దేశిత సమయంలో పొందుపర్చాలని డీఆర్‌డీఓ మొగులప్ప అన్నారు. శుక్రవారం స్థానిక చందన మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో లోకోస్ యాప్‌లో సమాచార నమోదు ప్రక్రియపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్(నేషనల్ రూరల్ లైవ్‌లీవుడ్) ద్వారా మహిళల సాధికారత కోసం మరిన్ని ప్రోత్సాహకాలు అందించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే కొనసాగుతున్న మహిళా ఎస్‌హెచ్‌జీల ప్రొఫైల్‌తోపాటు సభ్యుల వివరాలు పొందుపరిచి అప్‌డేట్ చేయాలని చెప్పారు. కంప్యూటీరకరణ సజావుగా జరిగేలా ఐకేపీ సిబ్బంది పర్యవేక్షిస్తూ వీఓఏలకు తోడ్పాటు అందించాలని సూచించారు. అనంతరం కొత్తగా విధుల్లో చేరిన మొగులప్పను సన్మానించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వెంకట్‌రెడ్డి, చందన మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు నల్ల ఉమ, సీసీలు వసంత, ఉమ, సోమనారాయణ, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురవుతున్న భూములు



జఫర్‌గఢ్ రెవెన్యూ పరిధిలో ఉన్న భూమిని సందర్శిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

జఫర్‌గఢ్: ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేశ్ పేర్కొన్నారు. సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్న 1645 సర్వే నంబర్‌లో ఉన్న రెండున్నర ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక యువకులతో కలిసి సీపీఐ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రమేశ్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ భూములు ఎక్కడ ఉంటే అక్కడ ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే భూములు ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో 1645 సర్వే నంబర్‌లో ఉన్న రెండున్నర ఎకరాల భూమిని సర్పంచ్ ఆక్రమించడం దారుణమన్నారు.ఈ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇందుకు బాధ్యుడైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీటితో పాటు ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్న వాటిని గుర్తించి హద్దులు నిర్ణయించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఎర్రజెండాలు పాతి పేదలకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కూరపాటి చంద్రమౌళి, ఎండీ. యాకుబ్ పాషా, ముసలయ్య, పెండ్యాల సమ్మయ్య, ఎండీ. ఖలీల్, చంటి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ పనులను పరిశీలించిన డీఈ



విద్యుత్ లైన్ పనులను పరిశీలిస్తున్న డీఈ

జఫర్‌గఢ్: మండలంలోని ఓబులాపూర్ సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న అదనపు 33/11 కేవీ విద్యుత్ లైన్ నిర్మాణ పనులను ట్రాన్స్‌కో డీఈ ఎం.హుస్సేన్ నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ లైన్ నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఓబులాపూర్ సబ్‌స్టేషన్‌కు పాలకుర్తి మండలం కొండాపూర్ సబ్‌స్టేషన్ నుంచి 33/11 కేవి విద్యుత్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా అందుతున్నట్లు తెలిపారు. దీంతో పాటు అదనంగా మరో విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో విద్యుత్ సరఫరా లో ఎలాంటి అవాంతరాలు ఏర్పడిన వెంటనే మ రో విద్యుత్ లైన్ ద్వారా సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అందించే అవకాశం ఉంటుందన్నారు. దీని కోసం అదనపు విద్యుత్ లైన్ పనులు చేపట్టినట్లు వివరించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.


రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

పాలకుర్తి : రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని రెడ్ ఫ్లాగ్ రాష్ట్ర నాయకుడు దొంతి రాజేష్‌కన్నా అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో రెడ్‌ఫ్లాగ్ 3వ మహాసభలు ఫిబ్రవరి 10, 11 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీని ఓడించేందుకు ప్రజాస్వామిక, లౌకిక కమ్యూనిస్టులు ఏకం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. దేశంలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం లెఫ్ట్ యూనిటీ, లెఫ్ట్ ఆల్టర్నేటివ్ దిశగా తమ పార్టీ పయనిస్తుందని అన్నారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు సుదమల్ల భాస్కర్, మాన్యపు భుజేందర్, ఎండీ.ఖాసిం, తూర్పాటి సారయ్య, తూర్పాటి వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దవాగులోకి నీరు వదలాలి



నీరు లేక ఎండిపోయి రాళ్లు తేలిన వాగు

చిల్పూరు: మల్లన్నగండి రిజర్వాయర్ తూము నుంచి పంటపొలాలకు సాగునీరు అందించేందుకు పెద్దవాగులోకి నీటిని వదిలి రైతులను ఆదుకోవాలని మండలంలోని ఫత్తేపూర్, గార్లగడ్డ తండా రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతీ పంటల సమయంలో నాట్లు వేయక ముందే వాగులోకి నీటిని వదిలేవారు. ఈ యాసంగిలో నారు పోసుకుని నాట్లు వేస్తున్నా నేటికి నీటిని వదలక పోవడంతో వాగునీటిపై ఆధారపడి వందమంది రైతులు పంటలు వేసుకుని ఎదురు చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పైప్‌లైన్ ద్వారా రిజర్వాయర్‌లోకి నీరు కూడా వస్తోందని మరో 10 రోజుల్లో నీటిని వదలకుంటే వేసుకున్న పంటలు ఎండుతాయని అన్నారు. రైతుల బాధలను అర్థం చేసుకుని వాగులోకి నీటిని వదలాలని సర్పంచ్ రూప్లానాయక్, రైతులు రాజశేఖర్, బాలు, సతీష్, మహేష్, దీప్ల, సింహాద్రి అధికారులను కోరారు.

గురుకుల విద్య.. బంగారు భవిత

జనగామ రూరల్: పేద విద్యార్థులకు గురుకుల విద్య బంగారు భవితను అందిస్తుందని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయ అధికారి కనగాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 5వ తరగతి ప్రవేశాలకు గాను జిల్లాలో పలు పాఠశాలల్లో విస్తృతంగా పర్యటించి వివరించారు. గురుకుల పాఠశాలలోనే గుణాత్మకమైన విద్యతో పాటు సకల సౌకర్యాలు ఉంటాయని ఆయన తెలిపారు. నేటితో దరఖాస్తు ప్రక్రియ ముగుస్తుందని ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు.